క్లుప్తంగా

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

ఏలేశ్వరం: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని స్వామి స్థైర్యానంద సరస్వతి కోరారు. పట్టణంలో ఆదివారం స్వామి దయానందా సరస్వతి ఆశ్రమం నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చదువుతో పాటు భగవద్గీతపై దృష్టి సారించాలన్నారు. ఆశ్రమంలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, కటకం కిరీటి, ఆశ్రమ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు కృష్ణుడి ఆలయం సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన జరిపారు. గ్రామస్తులు, తదితరుల సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులతోపాటు, ఇతర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

గండేపల్లి: గణేష్ ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు పొందాలని ఎస్సై శివ నాగబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న మండపాలు, ఊరేగింపులు, నిమజ్జనాలకు ఉత్సవ నిర్వాహకులు కమిటీగా ఏర్పడి ఉత్సవాన్ని జరుపుకోవాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానాన్ని అనుసరించాలన్నారు. ఈ విధానంతో అనుమతులు సులభంగా పొందవచ్చని, పోలీసుల సూచనలు పాటించాలన్నారు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునందనరావు సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జగ్గంపేట మండలంలో ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూగజీవాలతో ఇబ్బందులు



రాత్రి వేళ ప్రధాన రహదారిపై తిష్టవేసిన మూగజీవాలు

ఏలేశ్వరం: పట్టణంలో మూగజీవాలు విచ్చలవిడిగా సంచరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంపుగా రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి, పగలు లేకుండా రోడ్లపై పడకేస్తున్నాయి. వీటి యజమానులు పాలను సేకరించి రోడ్లపై వదిలివేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మూగజీవాలు ప్రధానంగా రహదారులను అవాసం చేసుకున్నాయి. వీటిలో ఎక్కువగా గోవులు ఉండటంతో ఏమి చేయలేక ప్రజలు మౌనం వహిస్తున్నారు. అధికారులు వీటి యజమానులకు కౌన్సింగ్ ఇచ్చి సమస్య పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613

ఏకదంతాయ.. గుణాధీశాయ!

- అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు
- విగ్రహాల తయారీతోనే ఉపాధి
- అందంగా ముస్తాబైన మండపాలు



గోకవరంలో చవితి ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు

గోకవరం: ఆది దేవుడు.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. సర్వదేవతలు కొలువైన పార్వతీ తనయుడు వినాయకుని పూజకు వేళైంది. లంబోదరున్ని భక్తి శ్రద్ధలతో పూజించి నిండు దీవెనెలు అందుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. తొలిపూజ ఉత్సవాలను దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం ఘనంగా నిర్వహిస్తారు. వినాయక చవితి వచ్చిందంటే ఊరూ, వాడ సందడి వాతావరణం నెలకొంటుంది. నెల రోజుల ముందు నుంచే చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తుంటారు. వేడుకల కోసం విగ్రహాల తయారీదారులు వివిధ రకాల గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తుంటారు. గోకవరంలో చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమయ్యారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ భవనంలో కొన్ని నెలలుగా విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు.

ఆకట్టుకునే ఆకృతుల్లో

ప్రస్తుతం ఇక్కడ అడుగు ఎత్తు నుంచి పది అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఏటా వివిధ రకాల అలంకారాల్లో విగ్రహాలను తయారు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా పంచముఖ వినాయకుడు, వివిధ అలంకారాల్లో తయారు చేసిన గణనాథుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 27న వినాయక చవితి సందర్భంగా పలు చోట్ల విగ్రహాల అమ్మకాలకు షాపులు వెలిశాయి. సోమ, మంగళవారాల్లో ఉత్సవాల నిర్వాహకులు విగ్రహాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణపై పోలీసులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఉత్సవాల నిర్వహణకు సూచనలివే

గణేష్ ఉత్సవాలకు ఎవరూ ఎటువంటి చలానాలు కట్టాల్సిన అవసరం లేదని పోలీసులు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్లో అనుమతి పొందవచ్చన్నారు. నాలుగు అడుగులు దాటిన విగ్రహాల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. మండపాలను రోడ్డు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలి. గణేష్ మండపం వద్ద రాత్రి సమయాల్లో ముగ్గురు వాలంటీర్లు కాపలాగా ఉండాలి. అగ్ని ప్రమాదాలు, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



వివిధ అలంకారాల్లో భారీ విగ్రహాలు

నిబంధనలు పాటించాలి

గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలి. మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పోలీసుల సూచనలు పాటించాలి. నిమజ్జనం ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి.

– పవన్‌కుమార్, ఎస్సై, గోకవరం.

జూద క్రీడలు, అశ్లీల నృత్య ప్రదర్శనలు, మత్తు పానీయాలు, మత్తు పదార్థాలు సేవించడం వంటి ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకూడదు. శబ్ద కాలుష్యం ఉండకూడదు. రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో లౌడ్‌స్పీకర్లు నిషేధం. మండపాల చుట్టూ పశుపక్ష్యాదులకు ఇబ్బంది లేకుండా రక్షణ ఏర్పాటు చేయాలి. ఉత్సవాల అనంతరం ఊరేగింపులు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో అధికారులు సూచించిన సమయంలో, నిర్దేశించిన ప్రాంతాల్లో పూర్తి చేయాలి. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి నీటి ప్రమాదాలు లేకుండా నిర్వాహకులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరి మనోభావాలను నొప్పించకుండా పూర్తి భక్తి, ఆధ్యాత్మిక భావంతో నిర్వాహకులు గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని పోలీసులు సూచనలిచ్చారు.

ముద్రగడ ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న గిరిబాబు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు చేయూత అందించారు. చినశంకర్లపూడి హరిజనవాడలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 6 తాటాకిళ్లు పూర్తిగా కాలి బూడిదైన సంగతి తెలిసిందే. ఆదివారం సాయంత్రం ముద్రగడ గిరిబాబు చినశంకర్లపూడిలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు చొప్పున 6 కుటుంబాలకు రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. జరిగిన సంఘటనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా కొండలరావు, మండల పార్టీ కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు గౌతు స్వామి, పార్టీ నాయకులు దాడిశెట్టి నూకాపతి, దళే చిట్టిబాబు, దాడిశెట్టి చక్రధర్, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గిరిబాబు



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి వి కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. గిరిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు 146 హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. అర్హత ఉండి పథకాలు అందని ఎంతో మంది లబ్ధిదారులు రోడ్డు పైకి వచ్చి నిరసన తెలిపే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొందన్నారు. ఫలితంగా ఓటు వేసి గెలిపించినందుకు పశ్చాతాపం వ్యక్తం చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు చేసిన పూజల ఫలితంగా తన తండ్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్నారన్నారు. తన కుటుంబం పట్ల చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, కొట్టేటి రాయుడు, జల్లిగంపల ప్రభాకరరావు, దళే చిట్టిబాబు, ఏడిద రెడ్డి నాయుడు, లొండ బాబు, నడిగట్ల శ్రీమూర్తులు, సానా నూకరాజు నాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, దాడిశెట్టి నూకాపతి, రామిశెట్టి దొరబాబు, చింతల రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

తుని: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం స్థానిక అధ్యక్షుడిగా తుని మండల పరిషత్ ఏఓ టీఆర్‌ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలో నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఉపాధ్యక్షుడిగా ఎండీవీ రమణమూర్తి, కార్యదర్శిగా శశికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చెక్రపాణిని ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీగా బీవీవీ సత్యన్నారాయణ, ట్రెజరర్‌గా దివ్య, జిల్లా కౌన్సిలర్లుగా రాజీవ్ కుమార్, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు సత్కరించి అభినందించారు.

తీర ప్రాంత రక్షణపై ఆందోళన



కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వెంకటేశ్వరరావు తదితరులు

కొత్తపల్లి: ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని బీసీ ఉద్యమ నాయకుడు, తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 21వ తేదీన ఉప్పాడ బీచ్ రోడ్డులో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం పోలీసులకు పత్రాలు సమర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీర ప్రాంతంలో ఉన్న కోనపాపపేట, ఉప్పాడ ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసివెళ్లడమే మినహా, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీర ప్రాంతంలో జనావాసాలు కనుమరుగవుతాయన్నారు. కరప మండలం ఉప్పలంక నుంచి తొండంగి మండలం అద్దరిపేట వరకూ ఉన్న 67 మత్స్యకార గ్రామాల్లో నెలకు రూ.11,500 పరిహారంగా ఇవ్వాలన్నారు. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికీ రూ.50 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న యువతకు జిల్లాలోని పరిశ్రమల్లో 20 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఆయా డిమాండ్లపై సెప్టెంబర్ 21న మత్స్యకారులతో కలిసి ఉప్పాడలో నిరాహార దీక్షను చేపడుతున్నట్టు వివరించారు.

ముదునూరి ఆర్థిక సాయం



సుభద్రను పరామర్శిస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వార్డు సభ్యుడు యాళ్ల ఏసును నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు, ఎంఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. ఏసు తల్లి సుభద్రకి స్థానిక దేవార్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం నిమిత్తం ఆమెకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ముదునూరి మురళీకృష్ణంరాజు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదునూరి సీతారామరాజు, జువ్వల దొరబాబు, పాకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో పోలీసుల ప్రత్యేక డ్రైవ్



ఉప్పాడ బీచ్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాటి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు ఈ–చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. వీరితో పాటు, అమాయకులు కూడా ప్రమాదాల బారినపడి క్షతగాత్రులు కావడమో, ప్రాణాలు కోల్పోవడమో జరుగుతుందని తెలిపారు.

యూరియా.. ఏదయా!

- ఎరువుల కోసం ఎదురుచూపులు
- అరకొర సరఫరాతో ఇబ్బందులు
- అధిక ధరలకు అమ్మకాలు?



ప్రత్తిపాడులో ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ (ఫైల్)

ప్రత్తిపాడు: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ రైతాంగం ఆరోపిస్తోంది. ఒకపక్క రైతులు ఎరువు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ విమర్శిస్తున్నారు. ఎరువుల కొరత వల్ల అక్కడక్కడా ఉన్న కొద్దిపాటి ఎరువులకు రెక్కలు వచ్చి అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు సేవా కేంద్రాలకు అరకొరగానే ఎరువులు చేరాయి. ఇవి కూడా పూర్తిస్థాయిలో చేరలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఎరువులు అవసరం మేరకు లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సి వచ్చింది. గత వారం రోజులుగా ప్రత్తిపాడు మండల వ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియాపై రూ.50లు, అపైన అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కొరత లేకుండా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని రైతాంగం కోరుతోంది.

అవసరం కొండంత.. సరఫరా గోరంత

ప్రత్తిపాడు మండలంలో గతేడాది కంటే ప్రస్తుత ఖరీఫ్ సాగు సుమారు రెండు వేల ఎకరాల మేర తగ్గింది. రైతులు ప్రత్యామ్నాయంగా సరుగుడు వైపు దృష్టి సారించారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం వస్తుందన్న ఆశతో మండలంలోని ఒమ్మంగి, పోతులూరు, వెంకటనగరం, రాచపల్లి, ప్రత్తిపాడు, పెద్దిపాలెం గ్రామాల్లోని రైతాంగం సుమారు రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్‌కు బదులు సరుగుడు సాగు చేపట్టారు. ప్రస్తుతం మండలంలో 8,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. వ్యవసాయాధికారుల లెక్క ప్రకారం ఎకరాకు ఒకటిన్నర బస్తా యూరియా అవసరం అవుతుందంటున్నారు. ఆలెక్కన మండల రైతాంగానికి 1,275 టన్నుల యూరియా అత్యవసరం. కానీ, ఇంతవరకు రైతు సేవా కేంద్రాలు, ఎరువుల వ్యాపారస్తులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీలు) ద్వారా ఇప్పటివరకు కేవలం 450 టన్నుల యూరియా మాత్రమే రైతులకు చేరింది. ఈ పరిస్థితి గత ప్రభుత్వంలో లేదని, రైతుకు కనీసం ఎరువు సరఫరా చేయని స్థితిలో ప్రభుత్వముందంటూ రైతాంగం వ్యాఖ్యానిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో యూరియా సరఫరా చేయాలని ముక్తకంఠంతో రైతాంగం కోరుతోంది.

తొలిదశలోనే ఇక్కట్లు పడుతున్నాం



గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం బస్తా రేటు రూ.500 పడిపోయింది. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్నట్టుంది రైతాంగం పరిస్థితి. ఎరువుల ధర పెరిగింది. ప్రస్తుతం 20 ఎకరాల్లో సాగు చేపట్టా. ఏనాడు ఎరువులకు ఇబ్బంది పడలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో సాగు తొలిదశలోనే ఎరువుల కోసం ఇక్కట్లు పడుతున్నాం.

– సీంద్రపు భాస్కరరావు, ఎంపీటీసీ, రైతు, ప్రత్తిపాడు.

చాలా గడ్డు పరిస్థితి



ఖరీఫ్ సాగు మొదలైంది. ఈ దశలో యూరియా అత్యవసరం. ఎరువుల కోసం చాలా కష్టపడాల్సి వస్తోంది. యూరియా కొరత అనేది ఈ సమయంలో చాలా గడ్డు పరిస్థితి. అధికారులు చొరవ చూపాలి. రైతు పాస్ పుస్తకం ఆధారంగా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేసి, రైతులకు సక్రమంగా అందించాలి.

– జువ్వల బాబులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు, రైతు, ధర్మవరం

రెండు రోజుల్లో అందిస్తాం



ఇప్పటివరకు మండల రైతాంగానికి 450 టన్నుల యూరియా సరఫరా చేశారు. మరో రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, డీలర్ల ద్వారా యూరియా అందించేందుకు ఏర్పాటు చేశాం.

– జోకా అమృత, మండల వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు.

శ్రీపాద శ్రీవల్లభస్వామికి పుష్ప పూజ



స్వామివారికి సహస్ర లిల్లీ పుష్ప పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలోని శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానంలో వేంచేసి ఉన్న శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి సహస్ర లిల్లీ పుష్ప పూజ జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్ సౌజన్య తెలిపారు. మహోత్సవాల సందర్భంగా మహారాష్ట్ర భక్తులు భారీగా తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.